
# విద్యాభివృద్ధికి అవరోధాలు.. వాతావరణ మార్పులు




## చాందిపుర వైరస్

- గుజరాత్‌లోని సబర్‌కాంతా జిల్లాలో చాందిపుర వైరస్ (CHPV) సోకి నలుగురు పిల్లలు మరణించారు. ఆరుగురు చిన్నారులకు చెందిన రక్తపు నమూనాలను పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి పంపారు. ఆ శ్యాంపిళ్ల ఫలితాల కోసం ఎదురుచూస్తున్నట్లు సబర్‌కాంత జిల్లా ఆరోగ్యశాఖ తెలిపింది.
- దోమలు, పేలు (ticks), ఈగలు, బొద్దింకలు, రెక్కల పురుగుల వంటి కీటకాల ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుంది. రక్షణాత్మక చర్యల్లో భాగంగా ప్రభావిత ప్రాంతాల్లో రెక్కల పురుగులను చంపుతున్నారు.
- ఈ వైరస్ 'రాబ్డోవిరిడే (Rhabdo viridae)' కుటుంబానికి చెందిన వెసిక్యులోవైరస్ (Vesiculovirus genus) జాతికి చెందింది.
- దీన్ని తొలిసారి 1965లో మహారాష్ట్రలోని చాందిపుర గ్రామంలో గుర్తించారు. దీంతో చాందిపుర వైరస్ అని పేరు పెట్టారు. 2003లో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో, 2004లో గుజరాత్‌లో ఈ వైరస్ కేసులు నమోదయ్యాయి.
- తీవ్ర స్థాయి ఇన్‌సెఫలైటిస్ (మెదడువాపు వ్యాధి) కూడా వస్తుంది. దీంతో చిన్నారులు చనిపోతారు.

**వైరస్ లక్షణాలు**

- మొదట తలనొప్పితో పాటు ఆకస్మిక అధిక జ్వరం, మూర్ఛ, వాంతులు, వికారం, అపస్మారక స్థితి కలుగుతుంది.
- ఈ వైరస్ ప్రధానంగా 2-16 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లలకు సోకుతుంది.
- వైరస్ సోకిన వారికి ఫ్లూ వంటి లక్షణాలు కూడా ఉంటాయి.
- ఇసుక ఈగ (Sandflies) కాటు ద్వారా ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. కొన్ని సందర్భాల్లో వర్షాకాలం దోమల ద్వారా కూడా ఈ వ్యాధి వ్యాపిస్తుంది.
- ఈ వ్యాధి సోకితే 55-75% మధ్య మరణాలు సంభవించే అవకాశం ఉంది.

**పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ**

- కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్మూ కశ్మీర్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం (ఈసీ) కసరత్తు చేస్తున్న నేపథ్యంలో జమ్మూ కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2019 అధికారాలను అమలు చేసే సెక్షన్ 55 నిబంధనలను కేంద్ర హోం శాఖ సవరించింది. ఈ సవరణలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో జూలై 12న గెజిట్ విడుదల కావడంతో ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయి.
- లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ)కు అంతర్గత భద్రత, బదిలీలు, ప్రాసిక్యూషన్, అటార్నీ-జనరల్, ప్రభుత్వ న్యాయవాదుల నియామకంతో సహా కీలకమైన విషయాల్లో కేంద్ర ప్రభుత్వం మరిన్ని అధికారాలు కల్పించింది. దీనికి ముందు పోలీస్, శాంతి భద్రతలు, అఖిల భారత సర్వీసులు, ఏసీబీకి సంబంధించి విచక్షణను అమలు చేయడానికి ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉండేది.
- సవరించిన చట్ట నియమాల్లోని సబ్ రూల్ (2ఎ) ప్రకారం ఆర్థికశాఖ సమ్మతి అవసరం లేదు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలను లెఫ్టినెంట్ గవర్నర్ ముందు ప్రధాన కార్యదర్శి ఉంచితే.. ఆయన ఆమోదించడం లేదా వాటిని తిరస్కరించే అవకాశం ఉంది.
- 2019 చట్టంలోని ప్రధాన నియమాల్లో 42 తర్వాత కొత్తగా 42(ఎ)ను చేర్చింది. ఈ నిబంధన ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రికి న్యాయ వ్యవహారాల్లో ఎలాంటి అధికారం ఉండదు. అడ్వకేట్ జనరల్ (ఏజీ) సహా ఇతర న్యాయాధికారుల నియామకానికి ప్రధాన కార్యదర్శి, లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదం తప్పనిసరి. సవరించిన చట్టాన్ని జమ్మూ కశ్మీర్ (రెండో సవరణ)- నియమాలు 2024 అని పిలవాలని కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది.
- 42 (బి) ప్రకారం, ప్రాసిక్యూషన్ లేదా అప్పీల్‌కు సంబంధించి ఏదైనా ప్రతిపాదనను న్యాయశాఖ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ ద్వారా ప్రధాన కార్యదర్శి లెఫ్టినెంట్ గవర్నర్ ముందు ఉంచుతారు.
- 43 నిబంధన కూడా జైళ్లు, డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ఫోరెన్సిక్ ల్యాబొరేటరీలకు సంబంధించిన అంశాలపై కొన్ని నిబంధనలు చేర్చుతామని గెజిట్ నోటిఫికేషన్‌లో కేంద్ర హోం శాఖ పేర్కొంది. అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు, అఖిల భారత సర్వీస్ క్యాడర్ అధికారుల పోస్టింగ్, బదిలీలకు సంబంధించి లెఫ్టినెంట్ గవర్నర్‌కు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, జీఏడీ ప్రధాన కార్యదర్శి ద్వారా ప్రతిపాదన పంపాలి.
- జమ్మూ కశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంత ప్రభుత్వ బిజినెస్ రూల్స్ (ప్రభుత్వ వ్యాపార లావాదేవీల నిబంధనలు) 2019ను కూడా కేంద్ర హోం శాఖ సవరించింది. ఈ సవరణలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో జూలై 12న గెజిట్‌లో పేర్కొనడంతో ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లో కొత్తగా ఎన్నికయ్యే ప్రభుత్వానికి అధికారాలు పరిమితంగా ఉండనున్నాయి.

**కేంద్ర సమాచార కమిషన్ అధికారాలు**



- కేంద్ర సమాచార కమిషన్‌కు విచారణ ధర్మాసనాలు ఏర్పాటు చేసే అధికారాలు ఉన్నాయని, ఇందుకు సంబంధించిన నిబంధనలు సైతం రూపొందించే అధికారమూ ఉందని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.
- స్వతంత్ర సంస్థ అయిన కేంద్ర సమాచార కమిషన్ సమర్థవంతంగా పని చేయడం ఎంతో కీలకమని, స్వతంత్రంగా, స్వేచ్ఛాయుతంగా పని చేయడానికి ఈ సంస్థ పాలక వ్యవస్థలకు నిర్ణయాలు తీసుకునే అధికారం ఉండాల్సిందేనని ధర్మాసనం అభిప్రాయపడింది.
- నిబంధనలను రూపకల్పన చేసే అధికారాన్ని సమాచార హక్కు చట్టం సీఐసీకి స్పష్టంగా ఇవ్వకపోయినప్పటికీ సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 12(4) ప్రకారం చీఫ్ కమిషనర్‌కు బెంచీలను ఏర్పాటు చేసే, నిబంధనలను రూపొందించేందుకు విస్తృత అధికారాలను ఇస్తుందని ధర్మాసనం పేర్కొంది.
- 2007లో అప్పటి చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ రూపొందించిన సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ (మేనేజ్‌మెంట్) రెగ్యులేషన్స్-2007ను ఢిల్లీ హైకోర్టు 2010లో కొట్టేసింది. తాజాగా ఢిల్లీ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

**సమాచార హక్కు ప్రాథమిక హక్కే..**

- సమాచార హక్కు అనేది 2005లో చేసిన భారత పార్లమెంట్ చట్టం. ఇది పౌరుల సమాచార హక్కుకు సంబంధించిన నియమాలు, విధానాలను నిర్దేశిస్తుంది. పూర్వ సమాచార స్వేచ్ఛా చట్టం-2002 స్థానంలో దీన్ని తెచ్చారు.
- '2020 సెప్టెంబర్ 20న అశ్వనీ కే సింగ్ కేసు'లో సమాచార హక్కు ప్రాథమిక హక్కు అని నిర్ధారణ అయింది.

**CICలో కమిషనర్ నియామకం**

- ప్రధానమంత్రి చైర్‌పర్సన్‌గా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి ద్వారా నామినేట్ అయిన కేంద్ర క్యాబినెట్ మంత్రితో కూడిన కమిటీ సిఫారసులపై రాష్ట్రపతి కమిషనర్లను నియమిస్తారు.

**కేంద్ర సమాచార కమిషన్**

- ఇది చట్టబద్ధమైన సంస్థ.
- 2005లో సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలకు సమాచార అభ్యర్థనలను సమర్పించలేని వ్యక్తుల నుంచి ఫిర్యాదులపై చర్య తీసుకోవడానికి ఏర్పాటయ్యింది.
- ప్రధాన సమాచార కమిషనర్, పది మంది వరకు సమాచార కమిషనర్లు ఉంటారు.
- ప్రస్తుత ప్రధాన సమాచార కమిషనర్: హీరాలాల్ సామరియా

## మత్స్య 6000(Matsya 6000)



- బంగాళాఖాతం, హిందూమహాసముద్రం వంటి సముద్ర గర్భాల్లోకి శాస్త్రవేత్తలు వెళ్లి లోతైన పరిశోధన చేసేందుకు డీప్ ఓషన్ మిషన్ (DOM)ను మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ (MoES) 'సముద్రయాన్'లో భాగంగా 'మత్స్య 6000' పేరుతో మానవ సహిత సబ్‌మెర్సిబుల్ వాహనాన్ని ప్రయోగించనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చెన్నైలోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (NIOT)'లో వేగంగా జరుగుతున్నాయి.
- 500 మీటర్ల లోతు వరకు మొదట మానవరహితంగా వెళ్లేలా వాహనాన్ని తయారుచేస్తున్నారు. తొలుత మనుషులేకుండా పంపి, ఫలితాల్ని అనుసరించిన తర్వాత మనుషులతో 2025, సెప్టెంబరు-డిసెంబరులోపు ట్రయల్స్ పూర్తిచేసుకుని 2026 నుంచి పరిశోధనలు చేపట్టనున్నారు.
- ప్రధానమంత్రి సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ అడ్వైజరీ కౌన్సిల్ (PM STIAC) కింద ఉన్న తొమ్మిది మిషన్లలో ఈ డీప్ ఓషన్ మిషన్ (DOM) ఒకటి.

**వివరాలు**

- డీప్ ఓషన్ మిషన్ (DOM)ను సముద్రయాన్‌లో భాగంగా 2021లో భూ శాస్త్రాల మంత్రిత్వ శాఖ ప్రారంభించింది.
- పైలట్, ఇద్దరు శాస్త్రవేత్తలు కూర్చొనేందుకు వీలుగా 2.1 మీటర్ల వ్యాసం కలిగిన గోళాకార గృహం(స్పియర్)ను తయారుచేశారు. ఇక్కడి నుంచే ఈ వాహనాన్ని శాస్త్రవేత్తలు నియంత్రిస్తారు.
- ఈ వాహనం అత్యాధునిక సాంకేతికత వ్యవస్థ సాయంతో స్వతంత్రంగా పనిచేస్తుంది. ఈ వాహనం 5 టన్నుల బరువు ఉంటుంది.
- భారతదేశ పరిధిలోని మహాసముద్రాల్లో గరిష్ఠ లోతు 6 వేల మీటర్లకు మించి 7,500 మీటర్ల మేర లోతుగా వెళ్లే సామర్థ్యం దీనికి ఉంటుంది.
- భూ ఉపరితలంతో పోల్చితే మహాసముద్రాల గర్భంలో 750 రెట్ల ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. పైగా 2 డిగ్రీల ఉష్ణోగ్రతే ఉంటుంది. అంతటి తీవ్రతను తట్టుకునేలా ప్రత్యేకంగా తేలికైన టైటానియం మిశ్రమ లోహంతో ఈ వాహనాన్ని తయారు చేస్తున్నారు.
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (NIOT) దీన్ని రూపొందిస్తుంది.
- సముద్రం లోపల 100 మీటర్ల తర్వాత ఎలాంటి విద్యుదయస్కాంత తరంగాలు గానీ, రాడార్, జీపీఎస్ గానీ పని చేయకపోవడంతో పరిశోధనల కోసం నేరుగా వెళ్లేందుకు ఈ వాహనాన్ని తయారుచేస్తున్నారు.
- ఈ వాహనంతో పాటు 'ఎమర్జెన్సీ రికవరీ బాయ్ యంత్రాన్ని' పంపుతారు. వ్యవస్థ విఫలమైనప్పుడు ఇది స్వతంత్రంగా సముద్ర ఉపరితలానికి వచ్చి శాటిలైట్ సిగ్నళ్లను అందుకుని సబ్‌మెర్సిబుల్ ఎక్కడ ఉందో చెబుతుంది. పరిశోధనల అనంతరం వాహనం తిరిగి పైకి వచ్చేస్తుంది.
- సముద్రగర్భంలోకి వెళ్లినంక వీలైనన్ని నమూనాలు సేకరించేందుకు 'మత్స్య 6000' వాహనానికి 12 పేలోడ్స్‌ను అమర్చుతున్నారు.
- సముద్రగర్భంలోకి వెళ్లడానికి 3 గంటలు, రావడానికి 3 గంటలతో పాటు పరిశోధన కోసం 6 గంటలు ఉండేలా ఏర్పాట్లు చేశారు.
- వ్యవస్థలు విఫలమైనా నీటిలోనే 96 గంటలు ఉండేలా 67 ఆక్సిజన్ సిలిండర్లను ఇందులో ఉంచారు. కార్బన్ డయాక్సైడ్‌ను తొలగించే సాధనాలూ ఉంటాయి.
- ఇప్పటి వరకు అమెరికా, రష్యా, జపాన్, ఫ్రాన్స్, చైనా దేశాలు మాత్రమే మానవ సహిత సబ్‌మెర్సిబుల్స్‌ను విజయవంతంగా ప్రయోగించాయి. ఇప్పుడు భారత్ 6వ దేశం కాబోతుంది.

ఎందుకు ఈ మత్స్య 6000?

- మట్టి, జీవులు, ఇతర అవశేషాలు, ఖనిజాలతో పాటు సముద్రగర్భ ఉపరితలాన్ని సర్వే చేయనున్నారు.
- భవిష్యత్తులో అక్కడ రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థ వృద్ధి, సునామీ కారకాలుగా ఉన్న భూగర్భ పలకల మధ్య పరిస్థితుల అంచనాకు ప్రత్యక్షంగా పరిశోధన చేయడానికి.
- ప్రపంచంలో ఏ మానవసహిత సబ్‌మెర్సిబుల్‌కు కూడా పూర్తిస్థాయిలో అధికారిక ధ్రువీకరణ లేదు. తొలిసారి 'మత్స్య 6000' ఈ రికార్డును సాధించబోతుంది. నార్వేలోని Det Norske Veritas (DNV) సంస్థ దీన్ని ధ్రువీకరిస్తుంది. డిజైన్లు, పరికరాలు, విడిభాగాలు విడతలవారీగా పరీక్షిస్తున్నారు.
- ఏడాది కిందట సముద్రగర్భంలో టైటానిక్ ఓడను చూసేందుకు వెళ్లి ఓషన్ గేట్ సంస్థకు చెందిన సబ్‌మెర్సిబుల్‌లో 5గురు మరణించడంతో NIOT మరింత అప్రమత్తమైంది. అలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతి విడిభాగం ధ్రువీకరణ పొందేలా జాగ్రత్తలు తీసుకుంటుంది.

## విద్యాభివృద్ధి పై వాతావరణ మార్పులు

UNESCO
Global Education Monitoring Report

- తీవ్ర ఉష్ణోగ్రతలు, కార్చిచ్చులు, తుఫాన్లు, వరదలు, కరవు, వ్యాధులు, సముద్ర మట్టాల పెరుగుదల వంటి వాతావరణ మార్పులు కారణంగా పలు దేశాల్లో విద్యాభ్యాసానికి, విద్యాభివృద్ధికి అవరోధం కలిగిస్తున్నాయని యునెస్కో వెల్లడించింది.
- ప్రపంచ విద్యా పర్యవేక్షణ నివేదిక (Global Education Monitoring Report-GEM) పేరుతో యునెస్కో, మానిటరింగ్ అండ్ ఎవాల్యుయేటింగ్ క్లైమేట్ కమ్యూనికేషన్, కెనడాలోని సస్కాచ్‌వాన్ యూనివర్సిటీ ఈ నివేదికను తయారు చేశాయి.

**నివేదికలోని ముఖ్యాంశాలు**

- వాతావరణ మార్పుల ప్రభావం దిగువ, మధ్యస్థాయి ఆదాయ దేశాల్లో ఎక్కువగా ఉంది. ఈ కారణంగా పలు దేశాల్లో పాఠశాలలు మూతపడుతున్నాయి, డ్రాపౌట్లు పెరుగుతున్నాయి.
- గత 20 ఏళ్లలో స్కూళ్లు మూతపడటానికి 75% తీవ్ర వాతావరణ మార్పులు కారణమయ్యాయి. 29 దేశాల్లో ప్రధానంగా ఆగ్నేయాసియాలో 1969 నుంచి 2012 మధ్య సగటును మించి ఉష్ణోగ్రతలు నమోదు కాగా ఈ ప్రభావం పాఠశాలలపై పడింది. ఇలాంటి ఉష్ణోగ్రతలున్న చోట పిల్లలు మిగిలిన ప్రాంతాల కంటే సగటున 1.5 ఏళ్ల పాఠశాల విద్యను నష్టపోయినట్లు అంచనా వేసింది.
- అత్యధిక ఉష్ణోగ్రతలు చైనా, అమెరికా దేశాల్లోనూ విద్యాభ్యాస స్థాయిని తగ్గించాయి. ఆఫ్రికన్ అమెరికన్, లాటిన్ ప్రాంతాలు, బ్రెజిల్ వంటి దేశాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు పాఠశాల పనిదినాలు తగ్గడానికి కారణమయ్యాయి.
- భారత్‌లో ప్రజల తొలి 15 ఏళ్ల జీవితంపై అధిక వర్షాపాతాలు ప్రభావం చూపుతున్నాయి. ఐదేళ్ల వయసులో పదజాలం నేర్చుకోవడంపైనా, 15 ఏళ్ల వయసులో గణితం, ఆలోచనా నైపుణ్యాల అభ్యాసంపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది.
- బాలురు, విద్యార్థుల తల్లిదండ్రులపై ప్రభావం ఎక్కువగా ఉంది.
- 7 ఆసియా దేశాల్లో 1,40, 000 మంది పిల్లల బాల్యంపై విపత్తుల ప్రభావం పడింది. పాఠశాలల్లో చేరలేకపోవడం, గణితంలో ప్రావీణ్యం తగ్గిపోవడం వంటి పరిస్థితులను బాలురు, బాలికలు ఎదుర్కొంటున్నారు.
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు సమగ్ర నియంత్రణ చర్యలు చేపట్టాలి. తగిన ప్రణాళిక, విద్యావిషయక అంశాల్లో సంస్కరణలు, ఉపాధ్యాయులకు శిక్షణ, సామాజిక అవగాహన కార్యక్రమాలు వంటివి చేపట్టాలి.

మల్లవరపు బాలలత
సివిల్స్ ఫ్యాకల్టీ
సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ,
హైదరాబాద్



# పిగుడుల బారి నుంచి భవనాలను రక్షించేది?



డీఎస్సీ, ఎస్‌జీటీ ప్రత్యేకం
ప్రాక్టీస్ టెస్ట్

### జూలై 18 తరువాయి

112. హల్లులకు మరో పేరు?
   1) ప్రాణాలు 2) స్వరాలు
   3) వ్యంజనాలు 4) నాదాలు
113. పాండురాజు అన్న ఎవరు?
   1) సుయోధనుడు 2) కర్ణుడు
   3) ధృతరాష్ట్రుడు
   4) దుర్యోధనుడు
114. పంచ పాండవుల్లో 3వ వాడు?
   1) నకులుడు 2) అర్జునుడు
   3) ధర్మరాజు 4) సహదేవుడు
115. కింది వాటిలో వర్గయుక్కు ఏది?
   1) ఖ, భ 2) ఫ, ఢ
   3) ఛ, ఘ 4) ఖ, ఘ
116. 'కపిలవస్తు' నగరంతో సంబంధం ఉన్న పాఠం?
   1) అమ్మ 2) నీటి అందాలు
   3) దయ 4) కాకుల లెక్క
117. 'కాకుల లెక్క' పాఠంలో బీర్బల్ చెప్పిన కాకుల సంఖ్య?
   1) పాట్నా పట్టణంలో 683 కాకులు
   2) ఢిల్లీ పట్టణంలో 6,803 కాకులు
   3) ఆగ్రా పట్టణంలో 8,603 కాకులు
   4) ఆగ్రా పట్టణంలో 6,803 కాకులు
118. తెలంగాణ 'కాశ్మీరం'గా భావించే ప్రాంతం?
   1) ఆసిఫాబాదు 2) హైదరాబాద్
   3) రంగారెడ్డి 4) ఆదిలాబాద్
119.కుంటల జలపాతం ఉండే జిల్లా ?
   1) కరీంనగర్ 2) నిజామాబాద్
   3) ఆదిలాబాద్ 4) నిర్మల్
120. కింది వాటిలో హ్రస్వాక్షరాలు ఏవి?
   1) అ, ఈ 2) ఏ, ఒ
   3) ఇ, ఎ 4) ఈ, ఊ
121. కింది వాటిలో ప్లుతాలు ఏవి?
   1) ఏ, ఓ 2) ఎ, ఒ
   3) ఆ, ఋ 4) ఐ, ఔ
122. 'కృపారాణి' పదంలో గురులఘువులు వరుసగా?
   1) UUUI 2) IUUI
   3) UIUI 4) IUUU
123. తెలంగాణ రాష్ట్ర జంతువు?
   1) కృష్ణ జింక 2) జింక
   3) పులి 4) సింహం
124. 'అలుగులు' అంటే ?
   1) పువ్వులు 2) పక్షులు
   3) బాణాలు 4) అగ్గినిప్పులు
125. 'అష్టోత్తర శతం' అంటే?
   1) 106 2) 118
   3) 116 4) 108
126. 'నర్మద, శైలజ, రాధ, సరిత, లక్ష్మి, అనిరుధ్' పాత్రలతో సంబంధం ఉన్న పాఠం?
   1) మనముంటే మారముంటది
   2) మాటల ప్రయాణం
   3) వృథా చేయం
   4) పరమానందయ్య శిష్యులు
127. 'దయ' పాఠంలోని ముఖ్యమైనది?
   1) నెమలి 2) హంస
   3) పావురం 4) చిలుక

### ఫిజికల్ సైన్స్

128. కింది వాటిలో సరైనది?
   ఎ. భూమిలోపల గల పలకల కదలిక వల్ల భూ ఉపరితలంపై ఈ పలకలకు దరిదాపుల్లో ఉండే బలహీన ప్రాంతాలను సెస్మిక్ లేదా భూకంప ప్రభావిత ప్రాంతాలు అంటారు
   బి. సముద్రాల అడుగుభాగంలో వచ్చే భూకంపాలను సునామీ అంటారు
   సి. ఆవేశం కలిగి ఉన్న వస్తువు నుంచి భూమి ఆవేశాలను బదిలీ చేసే ప్రక్రియను ఎర్తింగ్ అంటారు
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
129. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   ఎ. పిడుగులు ఏర్పడే ప్రక్రియను విద్యుత్ ఉత్సర్గం అంటారు
   బి. భూమినుంచి ఉత్పత్తి అయ్యే తరంగాలను భూకంప తరంగాలు అంటారు
   1) ఎ 2) బి
   3) ఎ, బి 4) పైవేవీ కావు
130. కింది వాక్యాలను పరిశీలించండి.
   శివ - వస్తువులను ఒక దానితో ఒకటి రుద్దినప్పుడు వెలువడే విద్యుత్ ఆవేశాలు స్థిర ఆవేశాలు
   రవి - విద్యుద్దర్శిని ద్వారా వస్తువు ఆవేశం కలిగి ఉందా లేదా తెలుసుకోవచ్చు
   సత్యవాక్యాన్ని తెలిపింది ఎవరు?
   1) శివ 2) రవి
   3) 1, 2 4) ఏదీకాదు
131. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   ఎ. తటిద్వాహకం పిడుగుల నుంచి భవనాలను రక్షిస్తుంది
   బి. ఆవేశం కలిగిన వస్తువులను చేతితో తాకినప్పుడు ఆవేశం కోల్పోతుంది
   సి. ఆవేశాలు శరీరంద్వారా భూమిని చేరవు
   1) ఎ, బి 2) ఎ
   3) సి 4) బి
132. ఉన్ని లేదా పాలిస్టర్ దుస్తులను చీకటిలో వేస్తే చిటపట ధ్వనిని వింటారు. మేఘాల రాపిడి ద్వారా ఏర్పడిన ఉరుములు, పాలిస్టర్ దుస్తుల నుంచి వచ్చే చిటపట ధ్వని రెండూ ఒక్కటే అని నిరూపించిన శాస్త్రవేత్త?
   1) ఓల్టా
   2) బెంజిమన్ ఫ్రాంక్లిన్
   3) లూయీ గాల్వని
   4) థామస్ ఆల్వా ఎడిసన్
133. పిడుగు పడే సమయంలో చేయవలసింది?
   1. గొడుగు ఉపయోగించడం
   2. అడవిలో ఉండే ఎక్కువ ఎత్తుగల చెట్ల కింద ఆశ్రయం పొందడం
   3. బహిరంగ ప్రాంతంలో ఉండటం
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) పైవేవీ కావు
134. కింది వాటిలో సత్య వాక్యాలను గుర్తించండి
   ఎ. ఉత్తర కశ్మీర్‌లోని యూరీ, తంగ్ధర్ పట్టణాల్లో 2005, అక్టోబర్ 8న భారీ భూకంపం సంభవించింది.
   బి. గుజరాత్‌లోని భుజ్ జిల్లాలో 2001, జనవరి 26న భారీ భూకంపం సంభవించింది
   సి. 2004, డిసెంబర్ 20న హిందూ మహా సముద్రంలో భారీ సునామీ సంభవించింది
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
135. కింది వాక్యాలను పరిశీలించి అసత్య వాక్యాలను తెలిపినది ఎవరు?
   వేణు - భుజ్, కశ్మీర్ భూకంపాలు రెండూ 7.5 కంటే ఎక్కువ తీవ్రతను కలిగి ఉన్నాయి
   రాణి - నిజమైన వినాశకర భూకంపాలు రిక్టార్ స్కేల్‌పై 7 కంటే ఎక్కువ తీవ్రతను కలిగి ఉన్నాయి
   1) వేణు 2) రాణి
   3) ఎ, బి 4) పైవేవీ కావు
136. భూకంపాల నుంచి రక్షణ పొందడానికి చేయవలసినవి?
   ఎ. అత్యంత భూకంప ప్రభావిత ప్రాంతాల్లో భారీ నిర్మాణ సామగ్రిని ఉపయోగించడం కంటే బంక మట్టి లేదా కలప ఉపయోగించడం మంచిది
   బి. అల్మారాలు, షెల్ఫ్‌లు గోడలకు బిగించాలి
   సి. భవనాలు, చెట్లు, ఓవర్ హెడ్ పవర్ లైన్లకు దూరంగా ఒక మైదాన ప్రదేశంలో ఉండాలి
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
137. ఒక గాజు కడ్డీని పట్టువస్త్రంతో రుద్దినప్పుడు...?
   ఎ. గాజు కడ్డీ పొందిన ఆవేశం ధనాత్మకం
   బి. పట్టువస్త్రం పొందిన ఆవేశం రుణాత్మకం
   సి. గాజుకడ్డీ, పట్టువస్త్రాలు రెండింటికీ ఆవేశం ఉండదు
   పైవాటిలో సరైనది?
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
138. కింది వాక్యాల్లో సరైనది గుర్తించండి.
   ఎ. ఆటస్థలంలో పొడవు, వెడల్పును కొలవడానికి అంగుళాన్ని ఉపయోగిస్తాం
   బి. 1 మీటరు = 100 మిల్లీ మీటర్లు
   సి. వక్రరేఖ పొడవును కొలవడానికి దారాన్ని ఉపయోగిస్తారు
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
139. స్వప్న, సరిత ఇద్దరు వారి దగ్గర ఉన్న డ్రాయింగ్ చార్టుల్లో పెద్దవి ఏది అని ఆలోచన చేస్తున్నారు. ఏ చార్టు పెద్దది? ఏ చార్టు చిన్నది? అని తెలుసుకోడానికి ఉపయోగపడే భౌతికరాశి ఏది?
   1) పొడవు 2) వెడల్పు
   3) ఘనపరిమాణం 4) వైశాల్యం
140. ఆకు ఆకార ఉపరితల వైశాల్యాన్ని కొలవడానికి సంబంధించి కింది వాటిలో సరైన వాక్యాలు ఏవి?
   ఎ. ఆకును గ్రాఫ్ కాగితంపై ఉంచి దాని చుట్టూ పెన్సిల్‌తో హద్దురేఖను గీయాలి
   బి. ఆకును తీసేసి దానిచేత ఏర్పడిన హద్దు రేఖను పరిశీలించాలి
   సి. హద్దు రేఖలోపల ఉన్న పూర్తి చదరాలను మాత్రమే ఆకు వైశాల్యంగా పరిగణించాలి. సగం లేదా అంతకంటే ఎక్కువ పరిమాణం గల చదరాలను పరిగణనలోకి తీసుకోకూడదు
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి
141. అసత్యవాక్యాలను తెలిపినవారిని గుర్తించండి.
   జీవిత - ద్రవాల ఘనపరిమాణాన్ని లీటర్లు లేదా మిల్లీలీటర్లలో తెలుపుతాయి
   జానకి - 1 మిల్లీలీటరు = 1 సెం.మీ$^3$
   1) జీవిత 2) జానకి
   3) 1, 2 4) ఎవరూకాదు
142. కింది వాటిలో సరికానిది గుర్తించండి.
   ఎ. ఎక్కువ దూరాలను కొలవడానికి ఉపయోగించే ప్రమాణం మీటరు
   బి. సెంటీ మీటరు స్కేలును ఉపయోగించి కొలవగలిగిన అతి చిన్న కొలత - సెంటీ మీటరు
   సి. ఘనాకార వస్తువుల ఘనపరిమాణాన్ని 'క్యూబిక్ మీటర్'తో కొలుస్తారు
   1) ఎ, బి 2) బి, సి
   3) ఎ, సి 4) ఎ, బి, సి

**జవాబులు**

| | | | |
|---|---|---|---|
| 112.3 | 113.3 | 114.2 | 115.4 |
| 116.3 | 117.4 | 118.4 | 119.4 |
| 120.3 | 121.4 | 122.2 | 123.2 |
| 124.3 | 125.4 | 126.3 | 127.3 |
| 128.4 | 129.4 | 130.3 | 131.3 |
| 132.2 | 133.4 | 135.4 | 136.4 |
| 137.1 | 138.3 | 139.4 | 140.1 |
| 141.4 | 142.1 | | |

ప్రాక్టీస్ బిట్స్ రూపొందించిన వారు
సైన్స్ - ఢిల్లీబాబు,
తెలుగు - వేణుగోపాల్
ఏకేఆర్ స్టడీ సర్కిల్, వికారాబాద్

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఎస్‌బీఐలో 1040 పోస్టులు..

**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **మొత్తం ఖాళీలు:** 1040
- **పోస్టులు:** సెంట్రల్ రీసెర్చ్ టీమ్, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ మేనేజర్, రిలేషన్‌షిప్ మేనేజర్, వీపీ వెల్త్, రీజినల్ హెడ్, ఇన్వెస్ట్‌మెంట్ స్పెషలిస్ట్, ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్
- **విభాగాలు:** ప్రొడక్ట్ లీడ్, సపోర్ట్, టెక్నాలజీ, బిజినెస్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 8
- **వెబ్‌సైట్:** https://sbi.co.in

### ఐవోసీఎల్‌లో..

**ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 476
- **పోస్టులు:** జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్, జూనియర్ క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్, ఇంజినీర్ అసిస్టెంట్, టెక్నికల్ అటెండెంట్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఆగస్టు 21
- **వెబ్‌సైట్:** https://iocl.com

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- గ్రూప్స్: జనరల్ ఎస్సే, బయాలజీ

కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.